అమలుకు నోచుకోని మంత్రి హామీ

- 24 గంటలు గడుస్తున్నా కదలని ధాన్యం
- తేమ శాతంతో ముడిపెడుతున్న అధికారులు



లంకపల్లిలో బుధవారం కౌలు రైతు మోటుపల్లి జయ ధాన్యాన్ని పరిశీలిస్తున్న మంత్రి మనోహర్

లంకపల్లి(ఘంటసాల): అమ్మ పెట్టదు... అడుక్కో నివ్వదు అన్నట్లు తమ పరిస్థితి తయారైందంటూ ఘంటసాల మండలం లంకపల్లి గ్రామానికి చెందిన కౌలు రైతు మోటుపల్లి జయ ఆరోపిస్తున్నారు. బుధవారం సాక్షాత్తు రాష్ట్ర పౌర సరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్ చేతిలో చేయివేసి మీ ధాన్యాన్ని సాయంత్రం లోపు తేమ శాతంతో సంబంధం లేకుండా రూ.1725కు కొనుగోలు చేస్తామని హామీ ఇవ్వడంతో గోనె సంచులు ఇచ్చారని సంతోషించామని, రాత్రి 11 గంటల వరకు అధికారులు తమ ధాన్యాన్ని తరలించడానికి ప్రయత్నించిన అవలేదని వాపోయారు. మంత్రి చెప్పి 24 గంటలు గడిచినా ఇప్పటివరకు ధాన్యం కొనే దిక్కులేదంటూ జయ ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి వచ్చారు... రైతులందరి ధాన్యం మిల్లులకు వెళ్లిపోతాయి.. మద్దతు ధర దక్కుతుందని ఆశించిన రైతులకు తీవ్ర నిరాశ ఎదురుకావడంతో నైరాశ్యంలో పడ్డారు.

దీనికి తోడు బేరగాళ్లకు అమ్ముకుందామంటే అధికారులు బేరగాళ్లను కార్యాలయాలకు పిలిపించి ఎవరైనా ధాన్యం కొనుగోలు చేస్తే బైండోవర్ కేసులు పెట్టడంతో పాటు రూ.లక్ష వరకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. దీంతో అయినకాడికి అమ్ముకోవడానికి కూడా అవకాశం లేకుండా పోయిందంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక హార్వెస్టర్లకు చెందిన వ్యక్తులను పిలిపించి తక్కువగా కోతలు కోయాలని హెచ్చరించడం బాధాకరమన్నారు. రైతు సేవా కేంద్రాల్లో ఒకలా, మిల్లర్ల దగ్గర ఒకలా, బేరగాళ్ల దగ్గర ఒకలా రైతుల బాధలు ఉన్నాయని, ఎవరి మాటలు నమ్మాలో అర్థం కాకుండా పోయిందని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రభుత్వం జోక్యం చేసుకుని తమను కష్టాల నుంచి గట్టెక్కించాలని లంకపల్లి రైతులు వేడుకుంటున్నారు.



లంకపల్లిలో రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం చూపుతున్న కౌలురైతు జయ

మంత్రి హామీ ఇచ్చినా...



15 ఎకరాలు కౌలు చేస్తున్నాను. బుధవారం ఉదయం మంత్రి మనోహర్ మా గ్రామానికి వచ్చి సాయంత్రం లోపు తేమ శాతంతో సంబంధం లేకుండా రూ.1725కే ధాన్యం కొనుగోలు చేసే బాధ్యత నాది అన్నారు. ఆయన హామీ ఇచ్చి 24 గంటలు గడిచినా నా ధాన్యం రోడ్ల పైనే ఉంది.

– మోటుపల్లి జయ, కౌలురైతు, లంకపల్లి

ధాన్యం తరలించేందుకు ప్రయత్నం చేస్తున్నాం



ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు ప్రయత్నం చేస్తున్నాం. రైతులు ఆందోళన చెందవద్దు. రైతులకు నష్టం కలిగించవద్దని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దళారులను హెచ్చరించాం.

– బి.విజయ ప్రసాద్, తహసీల్దార్, ఘంటసాల

క్లుప్తంగా

సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు



మోపిదేవి: మండలంలోని పలు గ్రామాల్లో దొంగతనాలు, నేరాలు అదుపు చేసేందుకు గ్రామాల్లోని ప్రధాన కూడలిలో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్ తెలిపారు. మోపిదేవి పోలీస్ స్టేషన్‌ను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్షిక తనిఖీలలో భాగంగా పోలీస్‌స్టేషన్ సందర్శించి, రికార్డులు పరిశీలించినట్లు తెలిపారు. స్టేషన్‌లో కేసులు త్వరితగతిన పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. చల్లపల్లి సీఐ ఈశ్వరరావు, ఎస్ఐ సత్యనారాయణ, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి

మచిలీపట్నంటౌన్: ప్రముఖ బీసీ నాయకుడు సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహానికి బురద చల్లి అవమానించి బీసీల మనోభావాలను దెబ్బతీసిన దుండగులను పోలీసులు వెంటనే పట్టుకుని కఠినంగా శిక్షించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కుక్కల వీర వెంకట సత్యనారాయణ డిమాండ్ చేశారు. స్థానిక బస్టాండ్ సెంటర్ సమీపంలోని సంఘ కార్యాలయంలో గురువారం సంఘ జిల్లా శాఖ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుడ్లవల్లేరు మండలం కౌతరం గ్రామంలో ఉన్న గౌతు లచ్చన్న విగ్రహానికి గుర్తుతెలియని వ్యక్తులు గత రాత్రి బురద రాసి అవమాన పర్చారన్నారు. దుండగులను వెంటనే పట్టుకోకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు. సమావేశంలో సంఘ నాయకులు రాగి చంద్రశేఖర్, బోలెం వెంకటేశ్వరరావు, వీరంకి రాము, టి.రాజ్యలక్ష్మి, ఎం.దేవిక, కొండేటి సుబ్రహ్మణ్యేశ్వరరావు, పి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం దళారీలతో తహసీల్దార్ సమావేశం



మోపిదేవి: ధాన్యం కొనుగోలులో రైతులకు, మిల్లర్లకు మధ్య దళారీ వ్యవస్థ ఉండరాదని తహసీల్దార్ ఎం.శ్రీవిద్య స్పష్టం చేశారు. తన కార్యాలయంలో గురువారం సాయంత్రం 10 మంది దళారులతో తహసీల్దార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ధాన్యాన్ని ఆర్ఎస్‌కే ద్వారా మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించినా, రైతుల నుంచి ఫిర్యాదులు అందినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్ఐ సత్యనారాయణ, పలువురు వ్యాపారస్తులు పాల్గొన్నారు.

ఈ-చలానాలపై ప్రత్యేక డ్రైవ్

కోడూరు: పెండింగ్‌లో ఉన్న ఈ-చలానాలను కట్టించుకునేందుకు కోడూరు పోలీసులు గురువారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. స్థానిక ప్రధాన సెంటర్‌లో ఎస్ఐ చాణిక్య సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహించారు. ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఈ-చలానాలను పరిశీలించి కట్టించారు. సరైన పత్రాలు లేని వాటికి జరిమానా విధించారు. వాహన చోదకులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్ఐ కోరారు.

భవిత కేంద్రాన్ని సందర్శించిన సమగ్ర శిక్ష అధికారి



పెడన: ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల విద్యా వనరుల కేంద్రం(భవిత కేంద్రాన్ని) సమగ్ర శిక్ష రాష్ట్ర అసిస్టెంట్ ఐఈడీ కో- ఆర్డినేటర్ పి.వనజ గురువారం సందర్శించారు. పెడన బంగ్లా స్కూలులోని ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల విద్యా వనరుల కేంద్రాన్ని (భవిత కేంద్రాన్ని) సందర్శించిన ఆమె ఎంఈవో హరినాథ్‌ను అడిగి పలు విషయాలను తెలుసుకున్నారు. దివ్యాంగ విద్యార్థులకు అమలవుతున్న ప్రశస్త యాప్ ద్వారా విద్యార్థుల స్క్రీనింగ్, అలవెన్సులు, స్కాలర్‌షిప్‌లు, ట్యాబ్‌ల ద్వారా బోధిస్తున్న తీరు, హోమ్ బేస్డ్ ఎడ్యుకేషన్ తదితర వివరాలను ఐఈఆర్పీ(సహిత విద్య రిసోర్స్ పర్సన్) రమ్య వివరించారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష జిల్లా ఏఎస్ఓ నగేష్ తదితరులున్నారు.

జూనియర్ కళాశాల విద్యార్థులకు ఆన్‌ది జాబ్ ట్రైనింగ్

అవనిగడ్డ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు గురువారం ఆన్‌ది జాబ్ ట్రైనింగ్ కార్యక్రమం జరిగింది. అకౌంటింగ్ టాక్సేషన్ విద్యార్థులు స్థానిక ఎస్టీవో కార్యాలయంలో నిర్వహించే బిల్లులు, ఉద్యోగుల జీతభత్యాల లెక్కల వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఒకేషనల్ ఎడ్యుకేషనల్ అధికారి పి.సాల్మన్‌రాజు, అధ్యాపకులు దుడ్డు కృష్ణారావు, అన్నపరెడ్డి శ్రీనివాసరావు, దిలీప్‌కుమార్, రవిశంకర్ పాల్గొన్నారు.

స్వామివారి కల్యాణ మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



మోపిదేవిలో షష్ఠి ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆలయ డీసీ వరప్రసాదరావు

మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి కల్యాణ మహోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామవరప్రసాదరావు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ డిసెంబర్ 6వ తేదీ శుక్రవారం నుంచి 8వ తేదీ ఆదివారం వరకు షష్ఠి కల్యాణ మహోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. వేద పండితుడు కొమ్మూరు ఫణికుమార్‌శర్మ, ఆలయ ప్రధానార్చకుడు బుద్దు పవన్‌కుమార్ శర్మ, ఆలయ ఘనాపాటి నౌడూరి సుబ్రహ్మణ్యశర్మ నేతృత్వంలో వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా షష్ఠి కల్యాణ మహోత్సవాలు మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు వివరించారు.

క్రీడాకారులకు రావెళ్ళ కృష్ణ ట్రస్ట్ సహాయం



చల్లపల్లి(అవనిగడ్డ): జాతీయస్థాయి స్కేట్ పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు రావెళ్ళ కృష్ణ సేవాసమితి చైర్మన్ రావెళ్ళ ఉదయ్‌కిరణ్ గురువారం రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. చల్లపల్లిలోని పలు ప్రైవేట్ స్కూల్ విద్యార్థులు 15 మంది సుబ్బు తైక్వాండో అకాడమీ ద్వారా జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిలో శ్రీ చైతన్య విద్యార్థులకు రవాణా, ఇతర ఖర్చుల కోసం ఈ మొత్తాన్ని ట్రస్ట్ అధ్యక్షుడు నిడమానూరి దిలీప్‌కుమార్ ద్వారా అందించారు.

రేపు మెగా పేరెంట్స్ మీటింగ్

నాగాయలంక: ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్‌లో 7వతేదీన మెగా పేరెంట్స్ మీటింగ్ నిర్వహిస్తున్నట్లు పాఠశాల హెచ్ఎం పీవీఎస్‌వీ ప్రసాద్ గురువారం తెలిపారు. ఉదయం 9.30 నుంచి ఒంటి గంట వరకు కార్యక్రమం జరుగుతుందని, విద్యార్థుల పురోగతిపై చర్చ, తల్లులకు రంగోలీ, తండ్రులకు టగ్ ఆఫ్ వార్ పోటీలు, తల్లుల యాంకరింగ్‌లో సాధారణ సమావేశం, పాఠశాల పురోగతిపై హెచ్ఎం నివేదిక, 12.30 గంటలకు అతిథి ప్రసంగాలు తదుపరి అభిప్రాయాలు-సూచనలు, తల్లిదండ్రులతో ప్రతిజ్ఞ, ఒంటి గంటకు శుభదిన్ భోజన్(సాధారణభోజనం)కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. తల్లిదండ్రులు, ఎస్ఎంసీ సభ్యులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

జాతీయ సేవా పథకం ప్రారంభం

మోపిదేవి: జాతీయ సమైక్యతకు ఉపయోగపడే పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దాలని బాపట్ల వ్యవసాయ కళాశాల (ఆర్ఏడబ్ల్యూఈపీ) ప్రిన్సిపాల్ డాక్టర్ స్వప్న తెలిపారు. మండలంలోని రావివారిపాలెం గ్రామంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు, జాతీయ సేవా పథకం-ప్రత్యేక శిబిరం గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 5వ తేదీ నుంచి 11వ తేదీ వరకు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు.

కొమ్మారెడ్డి పాఠశాలకు అవార్డు



బంటుమిల్లి: స్థానిక కొమ్మారెడ్డి ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాలకు హైదరాబాద్‌కు చెందిన బ్రెయిన్ ఫీడ్, ఈటీ టెక్ సంస్థలు సంయుక్తంగా ప్రతిష్టాత్మకమైన జ్యూరీ అవార్డును బహూకరించాయి. హైదరాబాద్, మాదాపూర్‌లోని హైటెక్స్‌లో గురువారం జరిగిన అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో అవార్డును పాఠశాల డైరెక్టరు కొమ్మారెడ్డి చైతన్యకు సంస్థ ప్రతినిధులు అందజేశారు.

అగ్ని బాధిత కుటుంబానికి వంట సామగ్రి పంపిణీ



బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు

కోనేరుసెంటర్: ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు చలమలశెట్టి చారిటబుల్ ట్రస్ట్ ఎల్లప్పుడూ ముందు ఉంటుందని ట్రస్ట్ వ్యవస్థాపకుడు, ప్రముఖ వ్యాపారవేత్త, గోల్డ్ ప్రిన్స్ అధినేత చలమలశెట్టి నరసింహారావు తెలిపారు. బందరు మండలం కానూరు గ్రామంలో ఇటీవల అగ్ని ప్రమాదానికి గురై సర్వం కోల్పోయిన ఈవన సత్యనారాయణ కుటుంబానికి గురువారం ట్రస్ట్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు, దుస్తులు, వంట సామగ్రిని అందజేశారు. మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ మాట్లాడుతూ చలమలశెట్టి చారిటబుల్ ట్రస్ట్ సేవలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ట్రస్ట్ మేనేజర్ చలమలశెట్టి పాండురంగరావు, బండి వీరాస్వామి, గోపు విజయ్ కుమార్, ఈవన ప్రకాష్ రావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

నేటి నుంచి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

నాగాయలంక: రెవెన్యూ, సర్వే శాఖల్లో కొత్త వినతుల స్వీకరణ, పెండింగ్ అర్జీల పరిష్కారం తదితర అంశాలపై నాగాయలంక మండలంలోని రెవెన్యూ గ్రామాల స్థాయిలో శుక్రవారం నుంచి సదస్సులు నిర్వహిస్తున్నట్లు స్థానిక తహసీల్దార్ ఎం.హరనాథ్ గురువారం చెప్పారు. ప్రజలు, రైతులు ఈ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

బందరు మండలంలో...

కోనేరుసెంటర్: బందరు మండలంలో ఈ నెల 6వ తేదీ నుంచి నిర్వహించనున్న గ్రామ రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని బందరు తహసీల్దార్ పి.మధుసూదనరావు కోరారు. ఈ నెల 28వ తేదీ వరకు నిర్వహించే ఈ సదస్సుల్లో ప్రజలు తమకు ఎలాంటి సమస్యలు ఉన్నా స్వయంగా తమ దృష్టికి తీసుకురావచ్చునన్నారు. గోపువానిపాలెం పంచాయతీ పరిధిలోని మేకవానిపాలెం సచివాలయంలో శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు రెవెన్యూ సదస్సు జరుగుతుందన్నారు.

నేడు జింజేరులో...

పెడన: మండల పరిధిలో శుక్రవారం నుంచి రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేసినట్టు పెడన ఇన్‌చార్జి తహసీల్దారు కె.అనిల్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని జింజేరు గ్రామంలో శుక్రవారం ఉదయం 9 గంటలకు ఈ సదస్సులు మొదలవుతాయని, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారని ఆయన తెలిపారు. భూ సమస్యలు ఏమైనా ఉంటే ఈ సదస్సులో లిఖిత పూర్వకంగా తెలియజేసి పరిష్కరించుకోవాల్సిందిగా ఆయన సూచించారు.

కృత్తివెన్ను మండలంలో ...

కృత్తివెన్ను: మండల వ్యాప్తంగా శుక్రవారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు రెవెన్యూ గ్రామసభలు జరుగుతాయని తహసీల్దార్ సోమేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

మోపిదేవిలో...

మోపిదేవి: మోపిదేవి మండలంలో ఈ నెల 6 నుంచి రెవెన్యూ గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఎం.శ్రీవిద్య తెలిపారు. షెడ్యూల్ ప్రకారం ఆయా రెవెన్యూ గ్రామాలలోని గ్రామ సచివాలయాల వద్ద ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సదస్సులు జరుగుతాయని వివరించారు.

గూడూరు మండలంలో...

గూడూరు: గూడూరు మండలంలో ఈనెల 6 నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు డి.రాజ్యలక్ష్మి తెలిపారు. గ్రామసభ జరిగే రోజు ఆ సచివాలయం పరిధిలో ఉచితంగా ధ్రువపత్రాలు జారీ చేస్తారన్నారు.

ఘంటసాలలో...

ఘంటసాల: ఘంటసాల మండలంలో శుక్రవారం నుంచి రెవెన్యూ సదస్సులు ప్రారంభమవుతాయని తహసీల్దార్ బి.విజయ్ ప్రసాద్ తెలిపారు.

గుర్రపుడెక్కతో తయారైన కళాకృతులకు ప్రోత్సాహం

జిల్లా కలెక్టర్ బాలాజీ



మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

చిలకలపూడి (మచిలీపట్నం): కాలువలు, చెరువుల్లో పెరిగే నాచురకం మొక్క గుర్రపుడెక్కతో తయారైన కళాకృతులకు ప్రోత్సాహం అందిస్తామని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మండల సమైక్య సభ్యులకు భరోసా కల్పించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో లేపాక్షి, ఆప్కో స్టోర్ ప్రతినిధులు, మచిలీపట్నం మండల సమైక్య సభ్యులతో ఆయన సమావేశమై గుర్రపుడెక్కతో చేస్తున్న వస్తువుల తయారీ, వాటి మార్కెటింగ్‌పై వారితో చర్చించారు. వారు తయారు చేసిన వస్తువులను ఆసక్తిగా పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల మహిళలకు ఇది మంచి ఉపాధిని కల్పిస్తుందని, దీనిపై ఇప్పటికే నిపుణులైన వారితో శిక్షణ ఇప్పించామన్నారు. దీనిపై మరింత మందికి శిక్షణ ఇప్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఏ అధికారులకు సూచించారు. వస్తువుల తయారీకి అవసరమైన ముడిసరుకు (గుర్రపుడెక్క)కు కొదవలేదని, దాని సరఫరాకు ఇరిగేషన్ శాఖ అధికారులకు ఫోన్ ద్వారా సూచనలు చేశారు. పర్యావరణ అనుకూలమైన వస్తువులకు ప్రస్తుతం మార్కెట్లో మంచి డిమాండ్ ఉందని, ఆ అవకాశాలను అందిపుచ్చుకుని ఎదగాలని ఆశించారు. వచ్చే సమావేశం నాటికి వారు తయారుచేసిన వస్తువులకు ధరలను నిర్ణయించటం , మార్కెటింగ్ కోసం ఆకట్టుకునే విధంగా ఒక పేరును (బ్రాండ్ నేమ్) ఆలోచించాలని మండల సమైక్య సభ్యులకు సూచించారు. సమావేశంలో డీఆర్డీఏ డీపీఎం సుధాకర్, లేపాక్షి సంస్థ ఎండీ విశ్వ, ఆప్కో కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, మచిలీపట్నం మండల సమైక్య సభ్యులు పాల్గొన్నారు.

సామూహిక ఎలుకల నివారణపై అవగాహన

మెరకనపల్లి(మోపిదేవి): ఎలుకలు అన్ని పంటల్లో నష్టాన్ని కలుగజేస్తున్నాయని, వీటి నివారణకు సామూహిక చర్యలు చేపట్టాలని ఘంటసాల కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ సుధారాణి అన్నారు. మండల పరిధిలోని మెరకనపల్లి గ్రామంలో రైతులతో గురువారం ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివిధ పంటలను నష్టపరుస్తున్న ఎలుకల నివారణకు సామూహిక చర్యలు చేపట్టాలని, బ్రమోడయాలోన్ విషపు ఎరను తయారుచేసుకుని పొలంలో పెట్టుకోవాలని సూచించారు. మినుములో ట్రైకోడెర్మా వంటి జీవ శిలీంధ్రనాశినితో విత్తన శుద్ధి చేసుకుని కాండం గజ్జి తెగులు ఉధృతిని తగ్గించుకోవచ్చని చెప్పారు. అనంతరం బ్రమోడయాలోన్ విషపు ఎర తయారీ విధానాన్ని, పాటించాల్సిన మెలకువలను నైపుణ్య ప్రదర్శన ద్వారా రైతులకు తెలియజేశారు.

పాఠశాల అభివృద్ధికి రూ.10వేల విరాళం

కోడూరు: మండలంలోని పాలకాయతిప్ప ఎంపీపీ పాఠశాలకు పూర్వ విద్యార్థులు రూ.10వేల నగదును విరాళం అందించారు. ఉల్లిపాలెం ఎంపీయూపీ పాఠశాల ఉపాధ్యాయుడు కాశీభొట్ల నాగభూషణం తాను చదువు చెప్పిన పూర్వ విద్యార్థుల సహకారంతో ఈ నగదును ఎంఈఓ టి.వి.ఎం.రామదాసు చేతుల మీదగా పాలకాయతిప్ప ఉపాధ్యాయ బృందానికి అందించారు. దీంతో పాటు నాగభూషణం తన సొంత నగదుతో రూ.3వేల విలువ చేసే పుస్తకాలు, స్టేషనరీని విద్యార్థులకు అందించారు. నాగభూషణం కృషిని ఎంఈఓ అభినందించారు.

పాల ఉత్పత్తిదారుల ఆర్థికాభివృద్ధికి కృషి



బోనస్ అందజేస్తున్న కృష్ణా మిల్క్ యూనియన్ అధ్యక్షుడు చలసాని ఆంజనేయులు తదితరులు

పెడన: పాల ఉత్పత్తిదారుల ఆర్థికాభివృద్ధికి కృష్ణా మిల్క్ యూనియన్ కృషి చేస్తోందని కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. మండల పరిధిలోని నడుపూరు పాల ఉత్పత్తిదారులకు గురువారం ఆయన బోనస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ గత ఏడాది యూనియన్‌కు రూ.40 కోట్లు లాభం వచ్చిందని, దీనిని పాడి రైతులకు బోనస్ కిందే కాకుండా వివిధ పథకాల కింద అందజేస్తున్నామని వివరించారు. గుడ్లవల్లేరు క్లస్టర్ పరిధిలో సంఘాలకు రూ.60,23,326 బోనస్ చెక్కులను రెండో విడతగా పంపిణీ చేస్తున్నామన్నారు. పశువులకు ఇన్సూరెన్స్, పాడి రైతులకు యాక్ట్ ఇన్సూరెన్స్, క్షీర బంధు, కల్యాణమస్తు, ప్రతిభ వంటి పథకాలతో పాటు ఆరోగ్య వైద్య శిబిరాలు, నాణ్యమైన పశుదాణా, జలగ మందులను, మంచి నాణ్యమైన బ్రీడెడ్ సెమెన్‌ను, మంచి పోషక విలువలు కలిగిన మినరల్ మిక్చర్, కాల్షియంలను పాల ఉత్పత్తి దారులకు మార్కెట్ కంటే తక్కువ ధరకు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా యూనియన్ పాలక వర్గ సభ్యుడు అర్జా వెంకట నగేష్, గుడ్లవల్లేరు పాల శీతలీకరణ కేంద్రం మేనేజర్ తోట సత్యనారాయణ, సంఘ అధ్యక్షుడు ఆత్మూరి రత్న మోహనరావు, వివిధ సంఘాల అధ్యక్షులు, సూపర్ వైజర్లు, పాల ఉత్పత్తిదారులు పాల్గొన్నారు.

రసాయనిక ఎరువులతో భూసారాన్ని నాశనం చెయ్యొద్దు



రైతులకు భూసార పరీక్షల కార్డులు అందజేసిన కేవీ విద్యార్థులు, ఉపాధ్యాయులు

మచిలీపట్నంటౌన్: రైతులు అత్యధికంగా రసాయనిక ఎరువులను వాడి భూసారాన్ని నాశనం చేసుకోకూడదని పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ మహమ్మద్ ఆసిఫ్ హుస్సేన్ అన్నారు. సుల్తానగరంలోని రైతు సేవా కేంద్రంలో ప్రపంచ మట్టి దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జరిగిన గ్రామసభలో ఆయన రైతులకు భూసార పరీక్షలు చేసిన కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల పొలాల్లో భూసారాన్ని పరీక్షించి దానికి అనుగుణంగా సాగుకు సేంద్రియ ఎరువులను వినియోగించి అత్యధిక దిగుబడులను పొందాలని సూచించారు. దీనికోసం కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖ 2024 మార్చిలో ద స్కూల్ సాయిల్ హెల్త్ ప్రోగ్రాం ప్రారంభించిందన్నారు. దీనిలో భాగంగా కేంద్ర ప్రభుత్వ వెబ్ సైట్‌లో రిజిస్టర్ అయిన విద్యార్థులకు నవంబర్ 12 వ తేదీన పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయంలో భూసార పరీక్షలపై అవగాహన శిక్షణ నిర్వహించామన్నారు. అనంతరం విద్యార్థులు సుల్తానగరంలోని పొలాల్లో 50 మట్టి నమూనాలు సేకరించారని, ఆ మట్టి నమూనాలు కేవీ సైన్స్ ల్యాబ్‌లో పరీక్షించిన అనంతరం సుల్తానగరం గ్రామ సభలో రైతులకు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఇన్‌చార్జి కె.సాహిత్య, పీఈటీ కిషోర్ కుమార్ గుప్తా, మట్టి నమూనాలు సేకరించిన విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాల స్థల సేకరణకు రూ.3.20 లక్షల విరాళం



దాత వెంకటరాజుకు ఆహ్వాన పత్రికను అందిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

కోడూరు: సముద్రతీర ప్రాంతమైన రామకృష్ణాపురం పంచాయతీలో జెడ్పీ పాఠశాల ఏర్పాటుకు అవసరమైన స్థలసేకరణకు ఓ దాత ఏకంగా రూ.3.20 లక్షల విరాళం ప్రకటించారు. మండలంలోని రామకృష్ణాపురం ఎంపీయూపీ పాఠశాలను జెడ్పీ పాఠశాలకు ఉద్యోగోన్నతి చేయాలంటూ పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు విద్యాశాఖకు విన్నవించారు. అయితే జెడ్పీ పాఠశాల ఏర్పాటుకు స్థలసేకరణ అవసరం కాగా, పాఠశాల ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా రూ.50వేల నగదును అడ్వాన్సుగా ఇచ్చి స్థల కొనుగోలుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. పంచాయతీ పరిధిలోని ఇరాలి గ్రామస్తులు రూ.40 వేల నగదును అందించారు. తాజాగా కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలానికి చెందిన నడింపల్లి చిన వెంకటరాజు స్థల సేకరణకు తన వంతుగా రూ.3.20లక్షల నగదును ప్రకటించారు. ఈ నగదును చెక్కు రూపంలో పాఠశాలకు అందించనున్నట్లు చిన వెంకటరాజు తెలిపారు. కోడూరు, నాగాయలంక మండలాల్లోని తీరప్రాంత విద్యార్థులకు ఈ ప్రాంతంలో జెడ్పీ పాఠశాల ఎంతో అవసరమని, ఉపాధ్యాయుల కృషిని దాత చిన వెంకటరాజు అభినందించారు. దాతను శనివారం జరిగే ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశానికి హాజరు కావాలని ఉపాధ్యాయ బృందం ఆహ్వాన పత్రిక అందించారు. హెచ్ఎం కారాని నాగార్జున, ఉపాధ్యాయులు మన్నె ప్రేమ్‌చంద్, పెరవలి రాంబాబు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు చేయాలి

సీపీఎం కృష్ణాజిల్లా కార్యదర్శి వై.నరసింహారావు

కొత్తపల్లి(ఘంటసాల): ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేయాలని సీపీఎం కృష్ణాజిల్లా కార్యదర్శి వై.నరసింహారావు అన్నారు. ఘంటసాల మండలం కొత్తపల్లి గ్రామంలో సీపీఎం, ఏపీ కౌలు రైతు సంఘం నేతలు పర్యటించి ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా నరసింహారావు, ఏపీ కౌలురైతు సంఘం కృష్ణాజిల్లా సహాయ కార్యదర్శి శీలం నారాయణ మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల్లో, మిల్లర్ల వద్ద తేమ శాతానికి మూడు శాతం వ్యత్యాసం వస్తుందన్నారు. ఓవైపు అన్ని రకాల ధాన్యాన్ని తీసుకోవాలని జిల్లా ఉన్నతాధికారులు, ప్రభుత్వం ప్రకటనలు చేస్తున్నా 1262 రకం ధాన్యాన్ని మిల్లర్లు కొనడం లేదన్నారు. ఆర్ఎస్‌కే సిబ్బంది నిర్ణయించిన తేమశాతం ప్రకారం రైతుల ధాన్యానికి ధర చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఏపీ కౌలురైతు సంఘం జిల్లా సభ్యుడు వాకా రామచంద్రరావు, మండల కార్యదర్శి మేడంకి వెంకటేశ్వరరావు, కంచర్ల నాగరాజు, బలే రమేష్, రైతులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

దేవరకోట(ఘంటసాల): దళారులను నమ్మి మోసపోవద్దని తహసీల్దార్ బి.విజయ్ ప్రసాద్ రైతులకు విజ్ఞప్తి చేశారు. దేవరకోట గ్రామంలో రైతులతో గురువారం ఆయన అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ధాన్యం కొనుగోలు చేసే దళారులను బైండోవర్ చేయడంతో పాటు రూ.లక్ష జరిమానా విధిస్తామని, హార్వెస్టర్లు పక్వానికి రాని ధాన్యాన్ని కోయవద్దని చెప్పడంతో పాటు ఆదాయం కోసం పరిమితికి మించి కోతలు కోయవద్దని చెప్పినట్లు తెలిపారు. రైతులు తయారు కాని ధాన్యాన్ని కోస్తే తేమ శాతం తేడా రావడంతో పాటు నష్టపోవాల్సి వస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ రైతు సేవా కేంద్రాల ద్వారా ట్రక్కు షీట్ జనరేట్ చేసుకున్న తర్వాతే ధాన్యాన్ని తరలించాలన్నారు. కార్యక్రమంలో ఏఓ కె.మురళీ కృష్ణ, వీఆర్వో నాగేశ్వరరావు, వీఏఏ సత్యదేవ్, రైతులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాలు ప్రారంభం

ఘంటసాల: ఘంటసాల గ్రామంలో ఉన్న శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం తిరుమంజోత్సవం, సాయంత్రం 6.30 గంటలకు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, అంకురార్పణ, రక్షాబంధనం, త్రిశూల పూజ, అగ్నిప్రతిష్ఠ కార్యక్రమాలను అర్చకుడు చావలి దుర్గామల్లికార్జున దీక్షితులు ఆధ్వర్యంలో చావలి కృష్ణకిషోర్ బృందంతో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు గొర్రెపాటి వెంకట రామకృష్ణ (ట్రస్టీ), గొర్రెపాటి జగన్మోహనరావు, గొర్రెపాటి సురేంద్ర, జనార్దనరావు, సురేంద్ర, నవీన్ పాల్గొన్నారు.

వెంకటాపురంలో ప్రపంచ నేలల దినోత్సవం

మోపిదేవి: మండలంలోని వెంకటాపురంలో గురువారం ప్రపంచ నేలల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ డి.సుధారాణి మాట్లాడుతూ భూసార పరీక్ష ఆధారిత ఎరువుల వాడకం వల్ల రసాయన ఎరువుల ఖర్చు తగ్గించుకోవచ్చన్నారు. అనంతరం మట్టి పరీక్ష పత్రాలను రైతులకు అందజేశారు. కేవీకే శాస్త్రవేతలు రేవతి, వెంకటలక్ష్మి, నవీన్, సహకార సంఘ ఇన్‌చార్జి లీల, రైతులు పాల్గొన్నారు.